

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు

ప్రజాశక్తి-హుకుంపేట: హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాటాన్ని అక్రమ కేసులతో అణచి వేయలేరని పోరాట కమిటీ స్పష్టం చేసింది. పోలీసులు ఇచ్చిన అనుమతులతోనే ధర్నా నిర్వహించగా, నాయకులపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కో-కన్వీనర్, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు తెలిపారు. ఈనెల 15వ తేదీన బూర్జ పంచాయతీ మజ్జివలసలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాట కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మఛ్ జాతీయ నాయకులు పి.అప్పలనస, అనంతగిరి జడ్పీటీసీ గంగరాజు, బలదేవ్,కృష్ణారావు లపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ధర్నాకు ఒకపక్క అనుమతులు ఇచ్చి, మరోపక్క పాల్గొన్న గిరిజనులపై పోలీసులు అడ్డంకులు సృష్టించడం, భయ భ్రాంతులకు గురి చేయడం దురదృష్టకరమన్నారు.నిరసన తెలిపిన గిరిజనులపైనే కేసులు నమోదు చేయడం పోలీసుల పక్షపాతం స్పష్టమవుతుందని తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై ఉధృత పోరాటం

- 22న సీలేరులో జీపు జాతా ప్రారంభం
- 27న మజ్జివలసలో ముగింపు బహిరంగ సభ
- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



మీడియాతో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసీ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 22న సీలేరులో జీపు యాత్ర ప్రారంభిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. పాడేరులో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ జీపు జాతాను పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాధం ప్రారంభిస్తారని, ముగింపు సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొంటారన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా 7 రోజుల పాటు సందర్శించి ఈనెల 27న జీపు యాత్ర ముగింపు సందర్భంగా హుకుంపేట మండలం బూర్జా పంచాయితీ మజ్జివలస గ్రామంలో నిర్వహించే అరణ్య గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీలకు అడవులు, భూములు, నీటి వనరులపై రాజ్యాంగం ప్రత్యేక హక్కులను కల్పించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం ఆదివాసీ హక్కులకు వ్యతిరేకంగా జి.ఓ నెం 51 జారీ చేసిందన్నారు. చిట్టంవలస (900 మెగావాట్స్), పెదకోట (2400 మెగావాట్స్), గుజ్జలి (2400 మెగావాట్స్), ఎర్రవరం (1800 మెగావాట్స్), సీలేరు (900మెగావాట్స్) తదితర ప్రాంతాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మిస్తే గిరిజనుల జీవనోపాధి నాశనమవుతాయన్నారు. చింతపల్లి, కొయ్యూరు, జి.కెవీధి, హుకుంపేట, అరకువ్యాలీ, అనంతగిరి మొదలగు మండలాల్లో సుమారు 9వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు సుమారు 10వేల ఎకరాల అటవీ, వ్యవసాయ భూములను మోడీ, చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. 250 గ్రామాల్లో 50 వేల మంది ఆదివాసీ ప్రజానీకంతో పాటు కాఫీ, మిరియాలు, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులన్నీ కూడా జల సమాధి కాబోతోందన్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఏజెన్సీ ప్రాంత అడవుల్లో సరిహద్దు సర్వే దిమ్మలు వేయాలని, డోన్ల ద్వారా గస్తీ చేయాలని నవయుగ కంపెనీకి అనుమతిచ్చారని తెలిపారు. రైతుల పట్టా భూములలో కూడా సర్వే చేసి దిమ్మలు వేశారని. పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తూ గ్రామాలో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. టి.ఎ.సి, గ్రామసభ ఆమోదం లేకుండానే నవయుగ, అదానీ, షిరిడిసాయి మొదలగు కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి అనుయాయులతో ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. ఈ హక్కులను గుర్తించకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం భూసేకరణకు ప్రభుత్వం పూనుకోవడం ఆదివాసీ చట్టం 1/70కి విరుద్ధ మన్నారు.ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఆదివాసీలకు 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ తెస్తామని అరకు ఎన్నికల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ 16 నెలలైనా నేటికి అమలు చేయలేదన్నారు. ఏజెన్సీలో వున్న 5వేల టీచర్ పోస్టులు గిరిజనేతరులకు కేటాయించి ఆదివాసీ యువతకు కూటమి ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం నూరుశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ ఉత్తర్వులు జారీ చేసి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి యువత ఆకాంక్షను ప్రభుత్వం తీర్చాలన్నారు.పిఎం జన్మన్ స్కిమ్ లో ఇళ్ల నిర్మాణానికి ఖర్చు చేసిన సొమ్ము సుమారు 15 కోట్లు లబ్ధిదారులకు ప్రభుత్వం బకాయిపడిందని చెప్పారు.బకాయి సొమ్ము లబ్ధిదారులకు చెల్లించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. అడ్డదారుల్లో కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలకు హైడ్రో ప్రాజెక్టు పేరుతో వేలాది ఎకరాలు మోడీ, చంద్రబాబు అప్పగించారని విమర్శించారు. రాజ్యాంగం స్ఫూర్తిని కార్పొరేట్ కంపెనీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిక్కరిస్తున్నాయన్నారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దాస్, పాడేరు మండల నాయకులు ఎస్. చిట్టిబాబు పాల్గొన్నారు.

మెగా డిఎస్సిలో అన్యాయం

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి
- ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి వెంటనే ప్రకటించాలి
- గిరిజన నిరుద్యోగుల దీక్షలకు సంఘీభావం



గిరిజన నిరుద్యోగులకు సంఘీభావం చెబుతున్న సిరిమల్లి రెడ్డి

ప్రజాశక్తి రంపచోడవరం : ఆదవాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించి, ఏజెన్సీలోని వందశాతం ఉద్యోగాలను గిరిజనుతోనే భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి. పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని, ఆదివాసీ యువత మేలుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించే వరకు పోరాడాలని, త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు గురువారం ఆదివాసీ నిరుద్యోగులు ప్రత్యేక డిఎస్సి సాధనకు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, . గతంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి నియామకాలు, ప్రమోషన్లలో జిఒ 3. ప్రకారం స్థానిక గిరిజనులుకు 36ఏళ్లపాటు వంద శాతం రిజర్వేషన్లు అందేవన్నారు. అయితే జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేయడం, తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తగు చర్యలు చేపట్టకపోవడ ఆదివాసుల తరపున రివ్యూ పిటిషన్ వేయడానికి, న్యాయ సమీక్షా జరపడానికి ఎటువంటి చర్యలు చేపట్టక నిర్లక్ష్యం చేశాయన్నారు. అయితే జిఒ 3 సాధన కమిటీ తరపున ఆదివాసి గిరిజన సంఘం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు గిరిజనుల పోరాట ఫలితంగా సుప్రీం కోర్ట్ పున్నసమీక్షించి 5వ షెడ్యూల్ క్లాజ్-2 ప్రకారం చట్ట బద్దత కల్పించాలని ముక్తకంఠంతో ఆదివాసీలు నినదిస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వీరికి రాబోవు స్థానిక సంస్థల్లో ఆదివాసులు తగిన గుణ పాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. ప్రత్యేక డిఎస్సి, జిఒ 3 ప్రయోజనాల సాధనకు నిరుద్యోగులు సమిష్టిగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

టెంట్ తొలగిస్తే సహించం

ప్రత్యేక డిఎస్సి సాధనకు ఆదివాసి నిరుద్యోగులు రెండు రోజులుగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం తరపున ఐటిడిఎ అధికారులు టెంట్ తీసేయాలని బెదిరింపులకు పాల్పడటం, కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని హెచ్చరించారు. ఆదివాసీ నిరుద్యోగులు అగ్రహానికి ఐ.టి.డి.ఎ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వం తరపున సమాధానం చెప్పాలని హితవు పలికారు. నిరుద్యోగుల టెంట్ బలవంతంగా తొలిగిస్తే, వేలాది మందిని సమీకరించి ఐటిడిఎ ముట్టడించి, దిగ్బంధం చేస్తామని ప్రకటించారు కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రంపచోడవరం మండల అధ్యక్షులు సాధల విద్యాసాగర్ రెడ్డి, డిఎస్సి సాధన కమిటీ నాయకులు ఎం.మురళీధర్, బి.రత్నాకర్, జి.లోవప్రసాద్, కె.రాజ్‌కుమార్, ఎం.నిరంజన్, ,పి.వినీత, కె.మల్లేశ్వరి, కె.సత్యాశ్యమాల, కె.లోవకుమారి, కె.రాజవేణి, ఎఐకెఎంఎస్ డివిజన్ నాయకులు ఐ.వి.రమణ, పి.డి.ఎస్.యు డివిజన్ అధ్యక్షులు దొరి నాగరాజు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి సేవా కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎలో జిల్లా ఆది కర్మయోగి సేవా కేంద్రాన్ని ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, గ్రామాల్లో ఆదికర్మ యోగి కార్యక్రమం ద్వారా ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి వికేంద్రీకరణ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదికర్మ యోగి కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం, క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని ప్రోత్సహించడం, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడం, అలాగే స్పష్టమైన పాత్రలతో గిరిజన వర్గాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ (పిటిజి) వెంకటేశ్వరరావు, పిఎంయు అధికారి వేణుగోపాల్, ఐటిడిఎ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

పిఒ శ్రీపూజకు అభినందనలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ నూతన పిఒగా బాధ్యతలు చేపట్టిన తిరుమణి శ్రీపూజను టిడబ్ల్యూటియు ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం గురువారం ఐటిడిఎలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పిఒకు పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన విద్యాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గిరిజన విద్యా వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎం.శోభన్ బాబు, ఉపాధ్యక్షులు పి.ఉపేంద్ర, ఎం.మోహన్ బాబు, కోశాధికారి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ భీమరాజు, సెక్రటరీ ఎస్.రమణ పిఒను కలిసిన వారిలో ఉన్నారు.

నిర్వాసితుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి



సమావేశంలో మాట్లాడుతున్న విజయభారతి

ప్రజాశక్తి- దేవీపట్నం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి శయని వెల్లడించారు గురువారం దేవీపట్నం మండలం కమలంపాలెం పునరావాస కాలనీలో పోలవరం నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు..ముందుగా నిర్వాసితుల సమస్యలను ఒక్కొక్కరినీ అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన వాటిని రికార్డ్ చేసుకున్నారు. నిర్వాసితులు చెప్పిన సమస్యలపై రెండు నెలలలోగా పరిష్కార చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా విజయ భారతి శయని మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి అందిందా లేదా అని ప్రశ్నించారు. గృహ నిర్మాణాలు ఏ మేరకు పూర్తయ్యాయి, భూమికి భూమి కేటాయించారా, లేదా అనే విషయాలను అడిగి తెలుసకున్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో అధికారులు సహకరిస్తున్నారా లేదాయని ప్రశ్నించారు. త్వరలోనే నిర్వాసితులందరికి న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు ఇంద్రజిత్ కుమార్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి, తహసిల్దార్ కే సత్యనారాయణ, ఎంపిడిఒ కె.సాల్మన్‌రాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్ఐ కె.షరీఫ్, మండల అధికారులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పట్టవా ?

- -బోధనేతర పనులు నిలిపేయాలి
- -ఆర్థిక బకాయిలు, డిఎలు చెల్లించాలి
- -రణభేరిలో యుటిఎఫ్ నేతలు



అరకులోయలో జాతాను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అరకులోయ: విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోసమే యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా రణభేరి బైక్ జాతా చేపట్టినట్లు ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు తెలిపారు. యుటిఎఫ్ రణభేరి బైక్ జాత గురువారం అరకు లోయలో రెడ్డి మోహన్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు చెల్లించే ఆర్థిక బకాయిలు, డిఏలు చెల్లించాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఓపిఎస్ అమలు చేయాలన్నారు. విద్య బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినా మోడ్రన్ ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ ఏర్పాటు మినహా, ఉపాధ్యాయులకు ఏమి చేయలేదని ఆయన అన్నారు. బోధ నేతర పనులు, యాప్ లు రద్దు చేస్తామని చెప్పి ఇప్పటికీ చేయలేదన్నారు. లీఫ్ అనే ఒక యాప్ తీసుకుని వచ్చి బోధనకు అనుకూలంగా లేకుండా అంతా లెక్కలు చెప్పే పని గానీ తీసుకెళ్తున్నారని ఆయన అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో యోగ డే, మెగా పిటిఎం, పి ఫోర్ వంటివి తీసుకొచ్చి కాలం వెలదీశారని విమర్శించారు. మళ్లీ పిల్లలకు ఇప్పుడు అరణ్య భోజనాలు పెట్టాలని చెబుతున్నారని, దీంతో నాణ్యమైన విద్య పిల్లలకు ఎలా అందుతుందని ఆయన ప్రశ్నించారు. ఈవెంట్లు కాదని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వంలో మార్పు రాకపోతే 25న పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసి రణభేరి మోగించి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ, సెల్ఫోన్ లేని బడి కల్పించాలని, ఉపాధ్యాయులకు ప్రశాంత వాతావరణంలో నాణ్యమైన విద్య అందించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.పెండింగ్ బకాయిలు 30 వేల కోట్ల రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీలక్ష్మి, జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు విజయ గౌరి, చిట్టిబాబు, రఘునాథ్, వివిధ మండలాల యుటిఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో పర్యటిస్తున్న నేతలు

అరకులోయరూరల్: కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలను విస్మరించిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి విమర్శించారు. అరకులోయ మండల కేంద్రంలోని గురువారం రణభేరి జాతా చేరుకుంది.అనంతరం ఆదివాసి గిరిజన సంఘం భవనంలో నుండి గవర్నమెంట్ హైస్కూల్‌కు చేరుకుంది. ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారులోకి వస్తే బాగా చూసుకుంటామని, సకాలంలో డిఎ, మెరుగైన పిఆర్సి ఇస్తామని హామీ ఇచ్చి తీరా ఆ ఊసేలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, కార్యదర్శి పి దేముడు, గౌరవ అధ్యక్షులు టి.చిట్టిబాబు, నాయకులు కే రఘునాథ్, ఎల్ నారాయణ, చంద్రశేఖర్, నారాయణ, కన్నయ్య, సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాత శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో చేరింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బోధన పని తప్ప మిగిలిన బోధనేతర పనులు కల్పించమని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీనిచ్చిందన్నారు . హామీలను అమలు పరచకుండా విస్మరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విబి మహేశ్వరరావు, జిల్లా నాయకులు కే రఘునాథ్, ఎస్ కన్నయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ బాలకృష్ణ పాల్గొన్నారు.

పాడేరు : యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా శాఖ అధ్యక్షులు వి.మహేశ్వర రావు ఆధ్వర్యంలో రాష్ట్ర రణభేరి బైక్ జాతా పాడేరు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కోశాధికారి రెడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ, తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించిన కూటమి నేతలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు., రాష్ట్ర కార్యదర్శులు ఎస్. కిశోర్ కుమార్, శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం పట్టణంలో ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వరరావు, సహాధ్యక్షులు టీ. చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు మొశ్యా. ధర్మారావు, పి దేముడు, ఆడిట్ కమిటీ సభ్యులు రఘునాథ్, నారాయణ పాల్గొన్నారు.

నేడు ఎంప్లాయీస్ గ్రీవెన్స్

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగుల కోసం ఈనెల 19వ తేదీ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై ఈ గ్రీవెన్స్‌లో ధరఖాస్తులను అందజేయవచ్చునని సూచించారు. ఇకనుంచీ ప్రతీనెలా 3వ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి

- గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు



నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీలో గిరిజనులకు నష్టం చేకూర్చే పంపు స్టోరేజీ హైడ్రో ప్రాజెక్టు అనుమతులు తక్షణమే రద్దు చేయాలని సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గురువారం జీపుజాతా ప్రారంభంలో భాగంగా దుప్పిలివాడ పంచాయతీ బూసికొండలో వివిధ గ్రామాల నిర్వాసిత గిరిజనులతో సమావేశం నిర్వహించారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు ప్రభాస్ అధ్యక్షతన సమావేశం బుజ్జిబాబు మాట్లాడుతూ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల పార్వతి నగర్, శాండికోరి, బూసికొండ గ్రామాలతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై సీలేరులో జరిగిన ప్రజాభిప్రాయసేకరణ సభలో నష్టపోతున్న కుటుంబాలకు ఇల్లు,భూమి, పరిహారం చెల్లిస్తామని అనేక హామీలు ఇచ్చి, వాటినిఅమలు చేయకుండా పనులు ప్రారంభించడం సరికాదన్నారు.. అధికారులు మాయమాటలు చెప్పి పనులు కొనసాగించిన ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈనెల 22న సోమవారం ఏజెన్సీలోని గిరిజన వ్యతిరేక ప్రాజెక్టులపై బూసికొండ నుంచి నిర్వహించే జీపుజాతాలో పాల్గొనడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. జీపుజాతా రథసారథి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నరసయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు కార్యదర్శులు పి బాలదేవ్, ఎస్ ధర్మన్న పడాల్ పాల్గొనే జీపుజాతాలో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డివిఎల్ఒ అధ్యక్షుడు మార్కు రాజు, మనోజ్, ప్రభాస్ శ్రీను, పెస కమిటీ సభ్యులు మరియు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎపి జెన్‌కో ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: తమ న్యాయమైన కోర్కెలు యాజమాన్యం తక్షణమే నెరవేర్చాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్రం ప్రధాన ముఖద్వారం ఎదుట జెన్‌కో విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన చేపట్టారు. కార్మికులు ఐక్యత, విద్యుత్ జెఎసి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ జెఎసి చైర్మన్ వై సత్తిబాబు, కన్వీనర్ వై ధాత్రరాజు మాట్లాడుతూ కేంద్ర విద్యుత్ జెఎసి పిలుపుమేరకు నిరసన చేపట్టామన్నారు. విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ డిఎలను వెంటనే అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని కోరారు.రిటైర్డ్ ఉద్యోగులకు పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎపి జెన్కో యాజమాన్యం మొండి వైఖరిని విడనాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని, లేకుంటే జెఎసి పిలుపుమేరకు విడతల వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ఎపి జెన్‌కో ఇంజనీర్లు,కార్మికులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు తెలుసుకునేందుకు కృషి



మోనటరింగ్ సెంటర్ ప్రారంభిస్తున్న పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి -రంపచోడవరం : ఆది కర్మయోగి సేవా కేంద్రాలలో వివిధ గ్రామాల సమస్యలు తెలుసుకొనేలా కేంద్ర ప్రభుత్వంఏర్పాటు చేసిందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి స్మరణ రాజ్ తెలిపారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటిడిఎ కార్యాలయ ప్రాంగణంలో ఆది కర్మయోగి సేవా కేంద్రాన్ని, కంట్రోల్ రూమ్‌ను ప్రాజెక్ట్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోడవరం పిఒ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎంపిక చేసిన 204 ఆది కర్మయోగి సేవా కేంద్రాలలో సమస్యలను ఐటిడిఎలో ఏర్పాటు చేసిన ఆది కర్మయోగి సేవా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు మోనిటరింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా, మండల, సచివాలయాల స్థాయిలో గ్రామాల యాక్షన్ ప్లాన్లు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసే విధంగా ఆన్‌లైన్ సౌకర్యం కల్పించామన్నారు.కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డిఎన్‌వి. రమణ, ఐటిడిఎ మేనేజర్ బి. రాజు, లీగల్ సెల్ డిప్యూటీ తహశీల్దార్ స్వామి, కార్యాలయ సిబ్బంది రమణి, వేదవతి, జి ఆనంద్, డి రాజు, సత్యవతి, నాగభూషణం, కె.సోమిరెడ్డి, నరసింహారావు, సాయి శిరీష , వెంకటరమణ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి

- ఐటిడిఎ పిఒ శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ సంబంధిత అధికారులను ఆదేశించారు. పిఆర్, పిఐయు, ఆర్అండ్ బి, ఎస్ఎంఐ, టిడబ్ల్యు ఇంజనీర్ శాఖల 11 మండలాల ఇఇ, డిఇ, ఎఇలతో నిర్మాణ పనులు అభివృద్ధి పురోగతిపై ఐటిడిఎ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ పథకాలు కింద మంజురైన పనుల పురోగతిపై ఆరా తీశారు. మంజురైనా పనులను నిర్దిష్టమైన గడువులోగ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ వారం అభివృద్ధి పనులపై సమిక్ష జరుగుతుందన్నారు. అలాగే వారంలో పనుల పురోగతి పెరగాలని సూచించారు. పిఎం జన మన్ కింద రహదారులు, అంగన్వాడి సెంటర్స్, హాట్ బజార్స్ అక్టోబర్ 10 లోగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి సమస్యలున్నా పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, టిడబ్ల్యు పాడేరు, అరకు ఇఇలు డేవిడ్ రాజు, కె.వేణుగోపాలరావు, ఆర్అండ్ బి ఇఇ బాలసుందర్ బాబు, పిఆర్ ఇఇ కొండయ్య పడాల్, పిఐయూ ఇఇ శ్రీనివాస్, ఎస్ఎంఐ ఇఇ రాజేశ్వరరావు, 11 మండలాల డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హుకుంపేట :మండల కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) మండల కార్యవర్గ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి వంతాల రామారావు, జిల్లా కార్యదర్శి ఎన్నికల అధికారిగా, అంబిడి శ్యాంసుందర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. నూతన మండల కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. మండల అధ్యక్షుడిగా మోస్య సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా కిల్లో భీమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ధనుర్జాయ్, జిల్లా కార్యదర్శి బి.చిన్నారావు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీలకు తీవ్ర నష్టం కలిగించే హైడ్రోపవర్ ప్రాజెక్టును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గిరిజన ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీల జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములను కంపెనీలకు కట్టబెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఆదివాసి ప్రజా ప్రతినిధులు ఆదివాసీల పక్షాన నిలబడి పోరాడాలని డిమాండ్ చేశారు. ఆదివాసి ప్రాంతాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని దార పల్లి అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న చెట్టి అనంతరావు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు అనంతరావు మాష్టారును కించాయి పుట్టు గ్రామపంచాయతీ సర్పంచి సీస సుభాష్ చంద్ర ఘనంగా సన్మానించారు. అనంతరం కించాయపుట్టు సర్పంచ్ మాట్లాడుతూ, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. వైవిధ్యమైన బోధనలతో పిల్లలను తీర్చిదిద్దడంలో నైపుణ్యత, సేవ భావంతో విధుల నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రాజు, హెచ్ఎం ,రామకృష్ణ, వి.హరిశ్చంద్ర పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో జీవనోపాధి

ప్రజాశక్తి-చింతపల్లి:తేనెటీగల పెంపకంలో మెలకువలు తెలుసుకోవడం ద్వారా గిరిజనుల జీవనోపాధి పెంపొందించుకోవచ్చునని హనీ మిషన్ నోడల్ అధికారి డి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, బుధవారం లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోనూ, అదే క్రమంలో గురువారం లంబసింగి లోను రెండు బృదాలకు శిక్షణ తరగతులను ప్రారంభించడం జరిగిందన్నారు. 10 లక్షల రూపాయల ఈ ప్రాజెక్ట్ లో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ద్వారా అందించే ఈ శిక్షణ ఉచితమన్నారు.శిక్షణ అనంతరం ఒక్కొక్క సభ్యునికి సుమారు 60 నుంచి లక్ష రూపాయల విలువచేసే విధంగా ఒక్కొక్కరికి 10 తేనె పెట్టెలను అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతి కుమారి, తేనెటీగల ప్రాసెసింగ్ మాస్టర్ ట్రైనర్ రమేష్, లంబసింగి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈఓ రాజేష్, సభ్యురాలు

24 నుండి నేషనల్ అడ్వెంచర్ ట్రెక్కింగ్ క్యాంప్

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



ప్రజాశక్తి-పాడేరు : ఈనెల 24 నుండి అక్టోబర్ 01 వ తేదీ వరకు నేషనల్ అడ్వెంచర్ ట్రెక్కింగ్ క్యాంప్ జిల్లాలో అరకువేలిలో జరుగుందని కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఎపిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్, ఎస్పి, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ఇతర అధికారులతో టెలికాన్ఫెరెన్స్ ద్వారా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ క్యాంప్ 13 ఆంధ్ర బెటాలియన్ ఎన్ సి సి వారు నిర్వహిస్తున్నారన్నారని తెలిపారు. ఈ క్యాంప్ కి పలు రాష్ట్రాల నుండి 565 ఎన్ సి సి క్యాడేట్లు రానున్నారన్నారు. ఈ క్యాంప్ కి నోడల్ ఆఫీసర్ గా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరుపున ఎల్ టి స్వామి నాయుడుని నియమించడం జరిగిందన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని, అన్ని పనుల నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 24వ తేదీ అరకువేలి ఎ ఎస్ ఆర్ స్కూల్ లో వార్షికోత్సవ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, 25న అరకువేలిలో పద్మావతి తోట, మ్యూజియం సందర్శన, మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు క్లీన్లీనెస్ డ్రైవ్ జరుగుతుందన్నారు. 26న గాలికొండ శిఖరానికి ట్రెక్. 210 మంది సభ్యులకు బొర్రా గుహలలోకి ఉచిత ప్రవేశం, జిల్లా అటవీ అధికారి ఆధ్వర్యంలో పోలీసు భద్రత గాలికొండ శిఖరం వద్ద ట్రెక్కింగ్ నిర్వహణ, రెండవ బ్యాచ్ ట్రెక్కింగ్ ఉంటుందన్నారు.27న గాలికొండ శిఖరానికి మూడవ బ్యాచ్ ట్రెక్కింగ్, బొర్రా గుహల సందర్శన టగ్ ఆఫ్ వార్ పోటీ క్విజ్ పోటీలు జరగనున్నాయన్నారు.28న నాల్గవ బ్యాచ్ ట్రెక్కింగ్, చాపరాయి, బొర్రా గుహలను సందర్శించడం జరుగుతుందన్నారు. 29న అర్మకొండ శిఖరం ట్రెక్కింగ్, క్యాడెట్ల డిబేట్ పోటీ జరుగనుందన్నారు. 30న సాంస్కృతిక కార్యక్రమం, అక్టోబర్ 01 తేదీన క్యాంపు ముగియనుందన్నారు.

టూరిజం కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-జిమాడుగుల:టూరిజం కార్మికులకు పెరిగిన ధరలు అనుగుణంగా జీతాలు పెంచకపోతే చలో ఐటిడిఏ నిర్వహిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు. గురువారం జిమాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం ఔట్సోర్సింగ్ కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కొత్తపల్లి జలపాతంలో 21 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సీజన్ నవంబర్ డిసెంబర్ జనవరి నెలలో 40 లక్షలకు పైబడి ఆదాయం వస్తుందని ఇచ్చే జీతాలలో మాత్రం తేడాలు ఉన్నాయన్నారు, పిఎఫ్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు లేవన్నారు, వచ్చే ఆదాయంలో 30శాతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు, డుంబ్రిగూడ మండలం చాపరాయి టూరిజం కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జి.మాడుగుల మండల కన్వీనర్ దీనబందు, గిరిజన సంఘం మండల కార్యదర్శి కోటి బాబు,, నాయకులు పాంగి ధనుంజయ్, గిరిజన టూరిజం కార్మికులు రాజు, వెంకట్,చంటి సురేష్, బాబురావు క్రిష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడాల్

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మహాసభలో పాల్గొన్న సిఐటియు ప్రతినిధులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపం వద్ద సిఐటియు మండల కమిటీ సభ్యులు సత్యవతి, శాంతమ్మ రవిల అధ్యక్షన రెండవ మండల మహాసభను గురువారం నిర్వహిచారు. ఈ సమావేశంలో అల్లూరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన సమక్షంలో నూతన కమిటీ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లుగా కొర్రా.శంకర్ రావు, రవి, కవితలు కోశాధికారిగా భవాని, కమిటీ సభ్యులుగా సతీశ్, శాంతమ్మ, సత్తిబాబు, దుర్గ, పద్మనాభం, భాస్కర్, దేవ, రాం ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమ మహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల పై ఉమ్మడి ఐక్య పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత మూడు సంవత్సరలుగా అనేక పోరాటాలు చేసి పలు స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశం సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్.సుందర్‌రావు, సర్పంచ్ కొర్రా.త్రినాధ్, అధిక సంఖ్యలో స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:పర్యాటక కేంద్రం లంబసింగి ఘాట్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బోడకొండమ్మ ఆలయం సమీపంలోని రెండవ మలుపులో లమ్మసింగి గ్రామ పంచాయతీ బిజెపి పార్టీ 1వ వార్డు సభ్యుడు, శివాలయం అర్చకుడు వాడకాని రాజ్‌కుమార్ (35) నర్సీపట్నం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న భారీ లారీని ఢీకొట్టాడు. బైక్ అదుపుతప్పి రోడ్డుపై బలంగా పడిపోయింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించే ప్రయత్నంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు.మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

30 కేజీల గంజాయి ద్రావణం స్వాధీనం

ప్రజాశక్తి.చింతపల్లి:చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తబంద గ్రామ సమీపంలో ఎక్సైజ్ అధికారులు భారీగా గంజాయి ద్రావణం (హసీస్ ఆయిల్) స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు చింతపల్లి ఎక్సైజ్ సీఐ జే. కూర్మారావు తెలిపారు. గురువారం గస్తీ నిర్వహించారు. ఈ క్రమంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించారు. వీరిలో ఇద్దరు పారిపోగా, ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు, 30 కేజీల గంజాయి ద్రావణం, 11.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ ఆపరేషన్‌లో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు వై. చైతన్య, ఎన్. రాంబాబు, కానిస్టేబుళ్లు కె. రమేష్, డి. కుమార్, ఆర్.డి. నాయుడు, డి. రవితేజ, జి. చంద్రరావు, జి. శివ, కె. అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట మండలంలో పిఒ పర్యటన

ప్రజాశక్తి -హుకుంపేట:- మండలం లోనితీగల వలస, సూకూరు పంచాయతీ నడిమి వీధి తీగల వలసలో నిర్మిస్తున్న హాట్ బజార్ ని గురువారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమని శ్రీపూజ సందర్శించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో డ్వాక్రా మహిళలు తో మాట్లాడారు. తీగలవలస గ్రామం తీగల వలస పంచాయతీ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇ ఇ వేణుగోపాల్ పాల్గొన్నారు..



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి:మండల అభివృద్ధి లక్ష్యంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ శాఖల నిధులు కోట్లాది వెచ్చించి అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక జెడ్పిటిసి దిసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణిలు అన్నారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి మర్దగుడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ కొర్రా సింహాద్రి ఆధ్వర్యంలో ఎంపీపీ జడ్పీటీసీలు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జెడ్పీ నిధులు రూ.7 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు వెచ్చించామన్నారు. గెలిచినప్పటి నుండి నేటి వరకు మండలంలో సుమారు రూ 1. ఒక కోటి 50 బై లక్షల రూపాయలు నిధులు తీసుకు రావడం జరిగిందని తెలిపారు.ఎంపీపీ చెట్టి నీలవేణి మాట్లాడుతూ మండల పరిషత్ నుండి మారుమూల గ్రామాల అభివృద్ధి కి లక్ష్యంగా పనిచేస్తున్నమని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో అనంతగిరి సర్పంచ్ సోమెల . రూతూ టోకూరు సర్పంచ్ కిల్లో. మోస్య జనసేన నాయకులు చిట్టం మురళి సీపీఎం నాయకులు సోమెల నాగులు మాజీ ఉపసర్పంచ్ జన్ని. గుండు గ్రామస్తులు రాము .సుబ్బారావు వార్డు సభ్యులు పేషా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



ఇందుకూరుపేటలో మాట్లాడుతున్న ఉమ

పోషకాహారంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - దేవీపట్నం: అంగన్వాడీ పిల్లలు,గర్భిణులు,బాలింతలు పోషకాహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం సిడిపిఒ కె.ఉమ, సూచించారు. గురువారం మండలంలోని ఇందుకూరుపేట స్త్రీశక్తి భవన కార్యాలయంలో సిడిపిఒ ఉమతోపాటు మండల పరిషత్తు ఎఒ ఎం. వెంకటేశ్వర్రావు, వెలుగు ఎపిఎం రాధా అపర్ణ, ఎంపిహెచ్ఇఒ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కన్వర్జేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమ మాట్లాడుతూ, ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా అంగన్వాడీల పోషకాహారంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. పిల్లల ఎదుగుదలకు పోషణకు ఏటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీలో నిర్వహించిన కార్యక్రమాలను వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తల్లులకు పిల్లలకు ఇచ్చే పోషకాహారం అమలులో అవకతవకలు పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్థూలకాయ నివారణకు, బాల్య దశ సంరక్షణవిద్య,, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు గ్రామీణ శక్తి సమగ్ర పోషణ, బాల్యవివాహాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించి, వాటిని బాధ్యతాయుతంగా అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహ రహిత భారతదేశంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు కారం అమ్మాజీ, పి. వెంకటలక్ష్మి, యాట్ల రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడి చెట్లు అక్రమ రవాణా

ప్రజాశక్తి -గంగవరం : మండలంలోని నువ్వు మామిడి గ్రామం నుంచి తాటిచెట్లు అక్రమ రవాణాకు యథేచ్ఛగా సాగుతోందనిసర్పంచ్ కురసం అక్కమ్మ, పీసా ఉపాధ్యక్షులు సన్యాసిరెడ్డి ఆరోపించారు. మోహనాపురం గ్రామపంచాయతీలోని నువ్వు మామిడి గ్రామంలో అనుమతులు లేకుండా కొందరు మైదాన ప్రాంత వ్యాపారస్తులు తాడిచెట్లు నరికి వాటిని ట్రాక్టర్‌లపై లోడ్ చేసి తరలిస్తున్నారు. రోడ్డు పొడుగునా ట్రాక్టర్ దుంగలను ఈడ్చుకుంటూ తీసుకెళ్లడంతో నువ్వు మామిడి వద్ద బిటి రోడ్డుతోపాటు ఉపాధి హామీ పథకంలో రోడ్డుకు రెండువైపుల నాటిన మొక్కలు చనిపోతున్నాయన్నారు. ఇష్టారాజ్యంగా దుంగలను ఈడ్చుకుంటూ పోవడం వల్లే మొక్కలు చనిపోతున్నాయన్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా, దీనిపై. గ్రామంలో పీసా సభ్యులు అడిగినా ఎవ్వరూ పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. . తక్షణమే అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరారు.

సచివాలయానికి ఫైబర్ నెట్

ప్రజాశక్తి - గంగవరం : మండలంలోని మోహనాపురం గ్రామపంచాయతీ సచివాలయానికి బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ కురుసం అక్కమ్మ తెలపారు. సరైన నెట్వర్క్ లేకపోవడంతో వివిధ ఆన్‌లైన్ పనులకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు సన్యాసి రెడ్డి, కార్యదర్శి సూరిబాబు, అలాగే పంద్రపోలు పంచాయతీ పీసా కమిటీ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, కార్యదర్శి జోగిదొరతోపాటు తాను ఆర్థిక సాయాన్ని సమకూర్చి, సచివాలయంలో ఫైబర్‌నెట్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది,ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:రేషన్ షాపుల ద్వారా సరుకులను రేషన్ డీలర్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ నగర్ వీధిలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు దోహదపడుతుందని రమణి అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పి నాగమణి, జి అనంత, పి దేవి, ప్రసాద్ వార్డు సభ్యులు వెచ్చం పులి పాల్గొన్నారు.

విశాఖలోనే ఇఎస్ఐ మెడికల్ కాలేజీ నిర్మించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇఎస్ఐ మెడికల్ కాలేజీని విశాఖలోనే నిర్మించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇఎస్ఐ ఇన్సూరెన్స్ కమిషనర్ ఢిల్లీ నుంచి వచ్చి మంగళవారం విజయవాడలో మాట్లాడుతూ ఇఎస్ఐ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీని అమరావతిలో త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ అమరావతిలోనే పెట్టించాలనే చంద్రబాబు ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం తలొగ్గి అమరావతిలో ఇఎస్ఐ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా 14 లక్షల మంది ఇఎస్ఐ సభ్యులు ఉన్నారని, విశాఖలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం తుది దశలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ హాస్పటల్ ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ (ఎఐఎంఎస్) అమరావతి వద్ద ఉన్న మంగళగిరిలో ఏర్పాటు చేయబడిందని చెప్పారు. కార్మికులు అత్యధిక మంది ఉన్న విశాఖపట్నంలో కాకుండా అమరావతిలో మెడికల్ కాలేజీ పెట్టడం సరైంది కాదని నర్సింగరావు అన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం అవుతున్న దగ్గరే మెడికల్ కాలేజీ కూడా ఉండాలని, దానికి భిన్నంగా ఇఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతికి బదలాయించడం సరైంది కాదని అన్నారు. ముఖ్యమంత్రి కేవలం అమరావతిలోనే అభివృద్ధి జరగాలనే విధానం పాటిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతే కాదని తెలిపారు. ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

విశాఖలోని షీలానగర్‌లో 2016లో ఆనాటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇఎస్ఐ 400 పడకల హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారని, 2022 వరకూ నిర్మాణాలు జరగలేదని అన్నారు. ఇఎస్ఐ బోర్డులో ఒత్తిడి చేయడం వల్ల 2022 నుంచి నిర్మాణం సాగుతోందని తెలిపారు.

ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం షీలానగర్ వద్ద ముగింపు దశలో ఉందన్నారు. దీనికి అనుబంధంగా ఇఎస్ఐ మెడికల్ కాలేజీని కూడా విశాఖలోనే నిర్మించాలన్నారు. మల్కాపురంలో ఇఎస్ఐ ఆసుపత్రి ఉందని, అక్కడ అవసరమైనంతమంది వైద్యులు లేరని తెలిపారు. ల్యాబ్ సదుపాయం కూడా లేదని చెప్పారు. ఈ రెండింటినీ సమకూర్చాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలం వీరంపల్లి గ్రామం వద్ద ఈనెల 14న ఆదివారం గంజాయి లోడ్‌తో వెళుతూ, అదుపుతప్పి జాతీయ రహదారి 516పై వాహనం బోల్తా పడిన ఘటనలో పరారైన గంజాయి నిందితులను గురువారం రంపచోడవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారి 516ఇ నిర్మాణ పనుల నిమిత్తం బీరంపల్లి గ్రామ సమీపంలోని రోడ్డు డైవర్షన్ ఉండగా, కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదానికి గురైన కారులో ఉన్న పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాలను విచారించగా గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని, మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి 50 టన్నుల యూరియా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలానికి 50 టన్నుల యూరియా వచ్చిందని మండల వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సంఘానికి 25 టన్నులు, అలాగే మండలంలోని వివిధ ప్రైవేట్ ఎరువుల డీలర్లకు 25 టన్నులు అందజేశామన్నారు.. రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని యూరియా సిద్ధంగా ఉందన్నారు

ఇప్పటివరకు మండలంలోని సుమారు 500 టన్నులు యూరియా రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ కార్యాలయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: హైవే పక్కన షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను హైవేపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయరాదని ఎస్ఐ శివకుమార్ సూచించారు. గురువారం రాజవొమ్మంగి మండల కేంద్రం రాజవొమ్మంగి అల్లూరి సెంటర్లో షాపు యజమానులతో ఎస్ఐ శివకుమార్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. ఇష్టం వచ్చినట్లు వాహనాలు పార్కింగ్ చేయడం, తమ అవసరాలు తీర్చుకున్న వెంటనే వెళ్లిపోవాలనే ఆత్రుతతో వాహనాలను సరైన విధానంలో పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ అంతరాయం కలిగించడం సరికాదన్నారు.

వినియోగదారులు తమ వాహనాలను సరైన పద్ధతిలో పార్క్ చేసుకునేలా దుకాణ యజమానులే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.హైవే పై సరైన పార్కింగ్ విధానం లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. షాప్ యజమానులు, వాహనదారులు అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పమన్నారు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంగన్వాడీ భవనాలు నిర్మించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:మండలంలోని రాజవొమ్మంగి పంచాయతీ పరిధిలోని పిటిజి గ్రామాలైన వయ్యాడ, బోరుగుపల్లి, అప్పలరాజు పేట, ముర్లవాని పాలెం, శ్రీరాంనగర్‌లో అలాగే రాజవొమ్మంగి 1 గ్రామాలలో అంగన్వాడీ భవనాలు లేక పిల్లలుఇబ్బందులను గురి అవుతున్నారని స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎపిఐఐసి డైరెక్టర్ జి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఐసిడిఎస్ పిడి ఝాన్సీరాం పడాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అరకొర సదుపాయాలున్న అద్దె భవనాల్లో అంగన్వాడీల నిర్వహణతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో సిడిపిఒ సుజాత, కూటమి నాయకులు కె బాబురావు, జె మధు, సావిత్రి పంచాయతీ కార్యదర్శి సంధ్య, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రేగులపాడులో పూజలు చేస్తున్న గిరిజనులు

సంప్రదాయబద్ధంగా ఆదివాసీ పచ్చ పండగ

ప్రజాశక్తి-కూనవరం: ఏటా ఆదివాసీ గ్రామాలలో నిర్వహించే ఆదివాసీ పచ్చ పండుగ సంబరాలు గురువారం రేగులపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు మాట్లాడుతూ పచ్చ పండుగ ప్రాముఖ్యత వివరించారు. గ్రామాల ముడుపు వద్ద వ్యవసాయం చేసే వరి,జొన్న, సామలు వంటి ప్రతి ఒక్క పంట మొక్కలను స్వచ్ఛమైన పాలతో పూజ చేసి, వాటిని తమ పొలాల్లో నాటుతామని, తద్వారా అధిక పంట దిగుబడులువస్తాయని విశ్వసిస్తామన్నారు. తర్వాత ముత్యాలమ్మ తల్లి విగ్రహాలను స్థానిక మహిళలు పసుపు కుంకుములతో ప్రక్షాళన చేసి, గ్రామ పూజారి సమక్షంలో ముత్యాలమ్మ గుడి వద్ద పూజలు చేస్తామన్నారు. తర్వాత గ్రామస్థులందరూ పచ్చని చెట్టు కింద ఆదివాసీ సాంప్రదాయ నైదం (భోజనం) వండుకొని భుజించారు. ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో కొత్తల, పెద్దల, కుర్మిన్ పండుగలు అని పిలుస్తారన్నారు. పచ్చ పండుగ లో రేగులపాడు పీసా కమిటీ ఉపాధ్యక్షులు గుండం బాబురావు, గ్రామ పెద్దలు బొగ్గా సుబ్బయ్య , బొగ్గ రాజమ్మ గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరిజన రోగులకు మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి-రంపచోడవరం: స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.సూర్యప్రకాష్ గురువారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. గుంటూరు జిల్లా ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు .ఈ సందర్భంగా డాక్టర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని, గిరిజన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అందరి సమన్వయంతో కృషి చేస్తానన్నారు. కాగా రంపచోడవరం ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ శేషారెడ్డి తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు.